సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 16 । ఫిబ్రవరి । 2024



సోమశిలలో 21.267 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారానికి 21.267 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టాతో పాటు వివిధ కాలువలకు 3500 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.63,410
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,695
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,866
నవర (8 గ్రాములు)	రూ.46,928

గరిష్టం/కనిష్టం
33.5 /25.0

వాతావరణం

గురువారం గాలిలో తేమ 56 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. శుక్రవారం పెద్దగా మార్పులు ఉండవని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

కావలి ఎమ్మెల్యే నివాసానికి చెవిరెడ్డి



చెక్కులను అందజేస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్‌గా నియమితులైన చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కావలిలోని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసానికి గురువారం వచ్చారు. సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు వీరు పంపిణీ చేశారు.

కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ



మాట్లాడుతున్న సాంబశివారెడ్డి

నెల్లూరు(పొగతోట): గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి పేర్కొన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ఆధార్ కంప్యూటర్ ఆపరేటర్లకు డీఆర్డీఏ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ప్రజలకు అవసరమైన సేవలను సచివాలయాల ద్వారా పూర్తి స్థాయిలో అందించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. అనంతరం వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

పది ఫలితాల్లో ముందంజలో ఉండాలి



మాట్లాడుతున్న రామారావు

నెల్లూరు(టౌన్): పదో తరగతి పరీక్షలకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను సన్నద్ధం చేసి.. ఫలితాల్లో ముందంజలో నిలిచేలా చర్యలు చేపట్టాలని డీఈఓ రామారావు పేర్కొన్నారు. నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో విద్యాధికారులతో గురువారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలను పాటించి.. అందరూ తినేలా చూడాలని కోరారు. నాడు – నేడు పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఏడీ గ్లోరీకుమారి తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్ల లోడుతో నౌక రాక నేడు

ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్‌కు కంటైనర్ల లోడుతో నౌక శుక్రవారం ఉదయం రానుందని పోర్టు ఉన్నతోద్యోగి గురువారం తెలిపారు. కంటైనర్ టెర్మినల్ తరలిపోతోందంటూ ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో లంగరు వేయనున్న కంటైనర్ల నౌకను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సందర్శించనున్నారని చెప్పారు.

బర్డ్ ఫ్లూ ప్రబలకుండా చర్యలు

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో బర్డ్ ఫ్లూ ప్రబలకుండా అన్ని జాగ్రత్తలు చేపడుతున్నామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మహేశ్వరుడు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పొదలకూరు మండలం చాటగొట్ల, కోవూరులోని గుమ్మళ్లదిబ్బలో కొన్ని కోళ్లు అనుకోకుండా మృతి చెందిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. వీటికి పరీక్షలు నిర్వహించగా బర్డ్‌ఫ్లూ అనే అనుమానాలు వచ్చాయన్నారు. కోళ్లు చనిపోతున్న ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులను చేపట్టనున్నామని వివరించారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో పలువురికి చోటు

నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో జిల్లాకు చెందిన పలువురు నేతలను నియమించారు. రాష్ట్ర సాంస్కృతిక కమిటీ ఉపాధ్యక్షుడిగా యనమల జాషువా, సేవాదళ్ ప్రధాన కార్యదర్శిగా దుగ్గిరెడ్డి కృష్ణాప్రసాద్ రెడ్డి, కార్యదర్శిగా రావు శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా అక్కెపాటి వినోద్‌కుమార్‌రెడ్డి, ఎస్టీ విభాగ కమిటీలో జోనల్ ఇన్‌చార్జిగా చేవూరి పద్మ, జాయింట్ సెక్రటరీలుగా పేరం వెంకటేశ్వర్లు, చలంచర్ల శ్రీనివాసరావు, గొల్ల ఉదయభాస్కర్ నియమితులయ్యారు.

మైపాడు రోడ్డుపై రయ్..రయ్

ఎంతో కీలకమైన మైపాడు రోడ్డు గత పాలకుల వైఫల్యంతో అభివృద్ధికి నోచుకోలేదు. ఫలితంగా నిత్యం ఇందుకూరుపేట మండలానికి రాకపోకలు సాగించే వారు.. వ్యవసాయ, రొయ్యల ఉత్పత్తుల తరలింపులో అవాంతరాలు ఎదురయ్యేవి. ముఖ్యమైన సందర్భాల్లో ట్రాఫిక్ స్తంభించి పలు సమస్యలు ఉత్పన్నమయ్యేవి. ఈ క్రమంలో ఈ కష్టాలకు చెక్ పెడుతూ నెల్లూరు నుంచి మైపాడు రోడ్డు అభివృద్ధికి ప్రస్తుత ప్రభుత్వం భారీగా నిధులను కేటాయించింది. దీంతో రహదారి పనులు దాదాపు పూర్తయ్యే దశకు చేరుకున్నాయి.

దశాబ్దాల కల సాకారం

- రూ.20 కోట్లతో రహదారి అభివృద్ధి
- ఇప్పటికే 2.7 కిలోమీటర్ల మేర సర్వాంగసుందరంగా రోడ్డు
- ముమ్మరంగా సెంట్రల్ లైటింగ్, డ్రెయిన్లు, ఫుట్‌పాత్ పనులు



సుందరంగా నిర్మించిన నాలుగు వరుసల సిమెంట్ రోడ్డుపై వాహనాల రాకపోకలు

ఇది కదా.. అభివృద్ధి

నెల్లూరు(బారకాసు): దశాబ్దాల కలైన మైపాడు రోడ్డు విస్తరణ పనులు ప్రస్తుత ప్రభుత్వ చలువతో సాకారమయ్యాయి. ఈ రోడ్డును బాగు చేయాలని స్థానికులు గతంతో పలుమార్లు కోరినా, అప్పటి ప్రభుత్వాలు పెడచెవిన పెట్టాయి. ఈ క్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సారథ్యంలో ప్రభుత్వం ఏర్పడ్డాక నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ చొరవతో రోడ్డు పనులు జరుగుతున్నాయి. నగరంలోని పాత చెక్‌పోస్ట్ నుంచి వేణుగోపాల్‌నగర్ సమీపంలోని చేపల మార్కెట్ వరకు నాలుగు వరుసల సిమెంట్ రోడ్డును నిర్మించారు.

నిత్యం రద్దీగా..

నగరం నుంచి ఇందుకూరుపేట మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి మైపాడు రోడ్డు. రోడ్డుకు ఇరువైపులా నగరపాలక సంస్థ పరిధిలో 3, 4, 5వ డివిజన్లు విస్తరించి ఉన్నాయి. గత పాలకుల వైఫల్యంతో మైపాడు రోడ్డు అధ్వానంగా మారింది. భారీ వాహనాల రాకపోకలతో ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. మరోవైపు ఆక్రమణల కారణంగా రోడ్డు కుచించుకుపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికుల్లో ఆందోళన ఉండేది. అడుగడుగునా ఏర్పడిన గుంతలతో సమయానికి గమ్యం చేరుకోలేక వాహనదారులు ఇబ్బంది పడేవారు. అయితే ప్రస్తుతం మైపాడు రోడ్డుకు మహర్దశ పట్టడంతో రూపురేఖలు మారిపోయాయి.

పనులు చకచకా..

మైపాడు రోడ్డు నిర్మాణ విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఎమ్మెల్యే అనిల్ పలుమార్లు తీసుకెళ్లారు. స్పందించిన సీఎం వెంటనే రోడ్డు నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో సంబంధిత శాఖ అధికారులు ప్రణాళికలను రూపొందించి ఆ దిశగా పనులు ప్రారంభించారు. మైపాడు రోడ్డు అభివృద్ధి కోసం రూ.20 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణాన్ని శరవేగంగా చేపట్టారు. పాత చెక్‌పోస్ట్ నుంచి వేణుగోపాల్‌నగర్, చేపల మార్కెట్ వరకు రూ.13 కోట్లతో 2.7 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల సిమెంట్ రోడ్డును పూర్తి చేశారు. దీంతో ప్రస్తుతం వాహన రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి.

ముమ్మరంగా సుందరీకరణ పనులు

మైపాడు రోడ్డును మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు రూ.ఏడు కోట్లతో పలు అభివృద్ధి పనులను చేపడుతున్నారు. ప్రస్తుతం రోడ్డుకు ఇరువైపులా డ్రెయిన్ల నిర్మాణం జరుగుతోంది. డివైడర్ నిర్మాణం పూర్తి కాగా ఇందులో 50 శాతం మేర సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. పార్కు అభివృద్ధి పనులూ జరుగుతున్నాయి. ఫుట్‌పాత్‌ల ఏర్పాటు.. డివైడర్లలో పచ్చదనం పెంచేలా అభివృద్ధి పనులను మరో రెండు నెలల్లో పూర్తి చేయనున్నారు. దీంతో మైపాడు రోడ్డు సర్వాంగసుందరంగా తయారుకానుంది.



రహదారిపై సెంట్రల్ లైటింగ్

చాలా సంతోషంగా ఉంది



నగరం నుంచి ఇందుకూరుపేట మండలానికి వెళ్లే మైపాడు రోడ్డును అభివృద్ధి చేయాలని ఏళ్ల నుంచి కోరుతున్నా, ఎవరూ పట్టించుకోలేదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కారణంగా ఈ రోడ్డు ప్రస్తుతం బాగుపడింది. రోడ్డు అభివృద్ధిని చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉంది.

– మద్దూరు సుబ్బారావు, మైపాడు గేట్ సెంటర్

సాఫీగా రాకపోకలు



మైపాడు రోడ్డు మీదుగా నగరంలోకి వెళ్లాలంటే గతంలో అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చేది. అడుగడుగునా ఏర్పడిన గుంతలతో రాకపోకలు సాగించడం చాలా కష్టంగా ఉండేది. ప్రస్తుత ప్రభుత్వంలో మైపాడు రోడ్డులోని ఆక్రమణలను తొలగించి నాలుగు వరుసల సిమెంట్ రోడ్డును నిర్మించారు. దీంతో రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి.

– సుబ్బారెడ్డి, బంగ్లాతోట

సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట



రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- సర్వేపల్లిలో వంద ఆలయాల నిర్మాణమే లక్ష్యం
- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఇందులో భాగంగా గ్రామాల్లో పెద్ద ఎత్తున మౌలిక వసతులను కల్పించారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని విరువూరు ఎస్సీ కాలనీలో రూ.పది లక్షలతో నిర్మించిన రామాలయ విగ్రహ ప్రతిష్ఠకు మంత్రి గురువారం హాజరయ్యారు. గ్రామంలో రూ.50 లక్షల సీజీఎఫ్ నిధులతో రామాలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. రూ.24 లక్షలతో సబ్‌స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన.. రూ.11 లక్షలతో వీసీబీ ఏర్పాటు.. రూ.40 లక్షలతో నిర్మించిన డ్రెయిన్ల ప్రారంభం.. రూ.87.2 లక్షలతో ఇంటింటికీ తాగునీటి కుళాయి కనెక్షన్ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. సర్వేపల్లి నియోజకవర్గంలో 100 ఆలయాలను నిర్మించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని తెలిపారు. టీటీడీ నిధులు, శ్రీవాణి ఫౌండేషన్, సమరసత సేవాసమితి సహకారంతో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఆలయాలను నిర్మించనున్నామని వెల్లడించారు. విరువూరులో నూతన సబ్‌స్టేషన్ భవనం, బ్రేకర్ నిర్మాణంతో నిరంతరాయంగా తొమ్మిది గంటల వ్యవసాయ విద్యుత్‌ను సరఫరా చేసే అవకాశం కలగనుందని చెప్పారు. శక్తి వంచన లేకుండా గ్రామాలను అభివృద్ధి చేశానని, రానున్న ఎన్నికల్లోనూ తనను ఆశీర్వదించాలని కోరారు. విరువూరు పంచాయతీ తనకు కంచుకోటగా మారిందని, ఇక్కడి నుంచి ఊహించిన దానికంటే అధికంగా మెజార్టీ రానుందని పేర్కొన్నారు. ఎస్పీడీసీఎల్ ఎస్ఈ విజయన్, ఈఈ జయకృష్ణారెడ్డి, ఏడీఈ సురేంద్రబాబు, ఎంపీడీఓ మహ్మద్ రఫీ, డిప్యూటీ తహసీల్దార్ శివబాలకృష్ణయ్య, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ, ఎంపీటీసీ విజయకుమార్, సర్పంచ్ జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనే లక్ష్యంగా వలంటీర్ల వ్యవస్థ



సీఎం ప్రారంభించిన వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి వీక్షిస్తున్న కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్ తదితరులు

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ
- పండగ వాతావరణంలో 'వలంటీర్లకు వందనం'

నెల్లూరు(దర్గామిట్ట): అవినీతి రహిత, పారదర్శక పాలనే లక్ష్యంగా వలంటీర్ల వ్యవస్థకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని.. ప్రజలకు సత్వర సేవలందించడంలో వీరి పనితీరు అభినందనీయమని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని గుంటూరు జిల్లాలోని ఫిరంగిపురంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి వర్చువల్‌గా నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ హరినారాయణన్, జెడ్పీ చైర్‌పర్సన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అరుణమ్మ మాట్లాడారు. సేవాభావంతో పనిచేస్తున్న వలంటీర్లను సత్కరించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి సీఎం శ్రీకారం చుట్టారని చెప్పారు. సేవా మిత్ర పురస్కారం ద్వారా జిల్లాలో 12,517 మందికి రూ.15 వేల చొప్పున.. సేవా రత్న పురస్కారం ద్వారా 225 మందికి రూ.30 వేల చొప్పున.. సేవా వజ్ర పురస్కారం ద్వారా 411 మందికి రూ.45 వేల చొప్పున నగదు బహుమతులతో పాటు ప్రశంసపత్రం, శాలువా, జ్ఞాపికతో సత్కరించనున్నామని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ప్రోత్సాహకాలతో వలంటీర్లు మరింత మెరుగ్గా తమ సేవలను అందించాలని కాంక్షించారు. అనంతరం ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు పురస్కారాలను అందజేసి సత్కరించారు. మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, అదనపు కమిషనర్ శర్మద తదితరులు పాల్గొన్నారు.



సత్కారం అందుకున్న వలంటీర్లు

సైకిల్‌కు సీరియల్ కష్టాలు

ఎన్నికలొస్తున్నాయంటే సాధారణంగా ఆయా నియోజకవర్గాల్లో సీటు దక్కించుకునేందుకు ఆశావహులు పోటీ పడతారు. నువ్వా.. నేనా అనే రీతిలో తలపడి తమ అభ్యర్థిత్వాన్ని పరీక్షించుకుంటారు. అయితే ఆత్మకూరు నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి ఇందుకు భిన్నంగా మారింది. ఆది నుంచి ఇక్కడ సరైన నాయకత్వం లేకపోవడంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బహిష్కృత ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డిని టీడీపీ అక్కున చేర్చుకుంది. అయితే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఉన్న అశేష ప్రజాదరణతో ఇక్కడ పోటీ చేసినా ఓటమి తప్పదని తెలియడంతో ఆనం విముఖత చూపుతున్నారు. ఈ పరిణామాలతో రండి బాబూ రండీ అనే రీతిలో కొత్త అభ్యర్థి కోసం టీడీపీ అన్వేషణను ప్రారంభించింది.

- ఆత్మకూరులో టీడీపీకి అభ్యర్థి కరువు
- ఆనం ముఖం చాటేయడంతో కొత్త అభ్యర్థి కోసం వెతుకులాట
- నగదు మూటలున్న వారికే ప్రాధాన్యం
- స్థానిక నేతలకు అంత సీన్ లేదన్న అధిష్టానం



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఆత్మకూరు నియోజకవర్గంలో టీడీపీలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. నియోజకవర్గ నాయకత్వంపై ఆ పార్టీకి నమ్మకం లేక వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డికి ఎర్రతివాచీ పరిచింది. అయితే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఆత్మకూరు కంచుకోట కావడంతో పోటీ చేసినా ఓటమి తప్పదనే సంకేతాలు ఆనంకు అందాయి. దీంతో పార్టీ కండువా కప్పుకోకముందే ఈ సీటు తనకొద్దంటూ తెగేసి చెప్పి మరోసారి వెంకటగిరి వైపు చూస్తున్నారు. నో చెప్పలేక వెంకటగిరి సీటును ఆనంకే ఖరారు చేశారని సమాచారం. ఈ పరిణామాలతో ఆత్మకూరులో అభ్యర్థి కోసం టీడీపీ వెతుకులాట ఇంకా కొలిక్కి రాలేదు.

వైఎస్సార్‌సీపీ గ్రాఫ్ పైపైకి..

ఆత్మకూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజాదరణ నానాటికీ పెరుగుతోంది. ఇక్కడి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి విద్యావంతుడు కావడంతో అభివృద్ధి విషయంలో ఓ ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో తనదైన శైలిలో విక్రమ్‌రెడ్డి దూసుకెళ్తున్నారు. నిరుద్యోగులకు జాబ్ మేళాలు.. ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ద్వారా పలు పనులను చేపడుతూ ప్రజల ఆదరాభిమానాలను చూరగొంటున్నారు.

ఆత్మకూరా.. నాకొద్దు..!

టీడీపీ నేత నారా లోకేశ్ యువగళం పాదయాత్రను ఆత్మకూరులో చేపట్టిన సమయంలో అన్నీతానై ఆనం రామనారాయణరెడ్డి నడిపించారు. ఆత్మకూరు బాధ్యత ఇక ఆయనదేనని లోకేశ్ ప్రకటించారు. దీంతో నెల పాటు నియోజకవర్గంలో హడావుడి చేసిన ఆనం ఆ తర్వాత వాస్తవ పరిస్థితి తెలుసుకొని ముఖం చాటేశారు. పార్టీతో పాటు వ్యక్తిగతంగా చేయించుకున్న సర్వేల్లో సైతం ఓటమి తప్పదని తేలడంతో ఆత్మకూరు అంటేనే హడలిపోతున్నారు.

దూరమైన సీనియర్ నేతలు

స్థానిక టీడీపీ నాయకత్వం సైతం ఆనం రామనారాయణరెడ్డికి సహకరించడంలేదు. కష్టకాలంలో పార్టీని నమ్ముకున్న మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, బొల్లినేని కృష్ణయ్యనాయుడు, గూటూరు కన్నబాబు లాంటి నేతలూ దూరంగా ఉన్నారు. అటు కేడర్ కలిసిరాక.. ఇటు నేతలు సహకరించక ఆయన మీమాంసలో పడ్డారు.

ఆత్మకూరు టు వెంకటగిరి వయా నెల్లూరు సిటీ

ఆత్మకూరు కలిసి రాకపోవడంతో నెల్లూరు సిటీ వైపు ఆనం మొదట్లో కన్నేశారు. నగరంలో తన కుటుంబానికి రాజకీయ బలంతో పాటు అభిమాన గణం ఉండటంతో నెల్లూరు సిటీ సీటును ఇవ్వాలని చంద్రబాబును ప్రాధేయపడ్డారని సమాచారం. అయితే నారాయణకు ఖరారు చేశామని స్పష్టం చేసిన బాబు.. సర్వేపల్లిలో ఛాన్స్ ఇస్తామని చెప్పినా సిట్టింగ్ సీటు కావాలని పట్టుబట్టడంతో ఓకే చేశారని తెలుస్తోంది.

సిట్టింగ్ స్థానంలోనూ తప్పని కుస్తీ

ఆనం రామనారాయణరెడ్డి తన సిట్టింగ్ సీటు వెంకటగిరిని మరోసారి దక్కించుకునేందుకు కుస్తీ పడాల్సి వస్తోందనే వాదనా వినిపిస్తోంది. ఇక్కడి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ రెండుసార్లు విజయం సాధించి పార్టీలో కీలక నేతగా వ్యవహరిస్తున్నారు. పార్టీని నమ్ముకొని ప్రస్తుత ఎన్నికల్లో పోటీకి సై అంటున్న క్రమంలో తన ప్రత్యర్థి ఆనం టీడీపీలోకి ఎంట్రీ ఇచ్చి సీటు తనదేనంటూ ప్రకటనలు చేయడంపై కురుగొండ్ల తీవ్రంగా మండిపడుతున్నారు. సీటు విషయంలో వీరిద్దరూ కుస్తీ పడాల్సి వస్తోంది. మరోవైపు వెంకటగిరి సీటును బీసీలకు కేటాయించాలని మరో నేత యత్నాలు ప్రారంభించారు. కాగా ఈ ముగ్గురిలో సీటు ఎవరికిచ్చినా మిగిలిన ఇద్దరూ హ్యాండిచ్చే అవకాశం లేకపోలేదనే చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది.

బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమీక్ష

బిట్రగుంట: కొండబిట్రగుంటలోని బిలకూట క్షేత్రంలో మార్చి 19 నుంచి 25 వరకు నిర్వహించనున్న ప్రసన్న వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవోపేతంగా జరిపేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నామని కావలి ఆర్డీఓ శీనానాయక్ పేర్కొన్నారు. బిలకూట క్షేత్రంలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఉత్సవ ఏర్పాట్లు, భక్తులకు కల్పించాల్సిన వసతులపై శాఖల వారీగా సమీక్షించారు. భక్తుల రద్దీకి తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వేసవి తీవ్రత దృష్ట్యా పెద్ద సంఖ్యలో చలువ పందిళ్లతో పాటు తాత్కాలిక స్నానపు గదులు, మరుగుదొడ్ల ఏర్పాటు తదితర అంశాలపై సూచనలు చేశారు.

పేదలకు సూపర్ వైద్య సేవలు

- జీజీహెచ్‌కు సూపర్ స్పెషలిస్ట్ డాక్టర్లు
- ఇద్దరు న్యూరో సర్జన్లు, న్యూరో ఫిజీషియన్ల నియామకం
- సర్జికల్ ఆంకాలజీ, యూరాలజీ విభాగాలకు వైద్యుల కేటాయింపు
- నేటి నుంచి ఓపీలు ప్రారంభం
- త్వరలో కార్డియాలజిస్ట్‌లు కూడా..

వైద్య రంగంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. దీంతో నెల్లూరు జీజీహెచ్ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. అధునాతన పరికరాలు ఏర్పాటు చేశారు. సిబ్బందిని నియమించారు. తాజాగా పేద ప్రజల కోసం మరికొన్ని అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. గతంలో స్పెషలిస్ట్ డాక్టర్ల కోసం ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వచ్చేది. ఇక నుంచి ఆ పరిస్థితి ఉండదు. ప్రతి ఒక్కరికీ కార్పొరేట్ స్థాయి వైద్యం ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా అందుతుంది.

నెల్లూరు సిటీ: మెదడుకు సంబంధించిన వైద్యం అత్యంత ఖరీదైంది. పేద, మధ్యతరగతి ప్రజలు ఈ వైద్యం చేయించుకోవాలంటే తలకుమించిన భారంగా ఉంటుంది. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రుల్లో ఖరీదైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. దశలవారీగా అన్ని రకాల వైద్యుల నియామకం చేపట్టారు. నెల్లూరు జీజీహెచ్‌కు వైద్యం కోసం జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వస్తుంటారు. వారికి స్పెషలిస్ట్ సేవలు అందేలా జగన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా మూడు రోజుల క్రితం న్యూరో విభాగానికి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ న్యూరో సర్జరీ డాక్టర్ జె.ధీరజ్, డాక్టర్ జె.దినేష్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ న్యూరాలజిస్ట్‌లు పి.ఫణికుమార్, ఎస్.లావణ్యను నియమించారు. ఇంకా అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ సర్జికల్ ఆంకాలజీ డాక్టర్ కె.వరుణ్ ప్రకాష్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ యూరాలజిస్ట్ జె.జయరాజ్‌ను కేటాయించారు. త్వరలో కార్డియాలజీ విభాగానికి సంబంధించిన వైద్యులను ప్రభుత్వం నియమించనుంది.

240 మంది డాక్టర్లు

ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి రోగులు జీజీహెచ్‌కు వస్తుంటారు. రోజూ 1,500 మంది వరకు వివిధ రకాల వైద్య సేవలు పొందుతుంటారు. రూపాయి ఖర్చు లేకుండా కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నారు. ఇక్కడ సుమారు 240 మంది వైద్యులు పనిచేస్తున్నారు. హాస్పిటల్లో మొత్తం 750 బెడ్స్ ఉన్నాయి. రోజూ ఇన్‌పేషెంట్లుగా దాదాపు 600 మంది చికిత్స పొందుతుంటారు.



నెల్లూరులోని ప్రభుత్వాస్పత్రి

ఎంతో ఉపయోగం

అయితే ప్రధానమైన న్యూరాలజీ, కార్డియాలజీ విభాగాలకు వైద్యసేవలు అందుబాటులో లేక పోవడంతో రోగులు ఇతర నగరాల్లోని ప్రభుత్వ హాస్పిటల్స్, ఇంకా జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు. జీజీహెచ్ అధికారులు హాస్పిటల్‌కు స్పెషలిస్ట్ డాక్టర్లను కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. దీంతో ముందుగా న్యూరాలజీ విభాగానికి సంబంధించి సర్జన్లు, ఫిజీషియన్ల నియామకం పూర్తి చేశారు. త్వరలో అత్యంత కీలకమైన కార్డియాలజీ విభాగానికి వైద్యులను నియమించనున్నారు. ప్రస్తుతం హృద్రోగులు అధికంగా ఉన్నారు. కరోనా కారణంగా చాలామంది గుండె సంబంధిత జబ్బులతో బాధపడుతున్నారు. స్టెంట్లు వేయించుకునే వారు నానాటికీ పెరుగుతున్నారు. ఇంకా బైపాస్ సర్జరీలు చేయించుకుంటున్న వారు అధికమైంది. ప్రస్తుతం రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తుండగా వారికి ఆరోగ్యశ్రీ ఎంతో భరోసానిస్తోంది. అదే జీజీహెచ్‌లోనే కార్డియాలజీ సేవలు అందుబాటులోకి వస్తే పేదలు ప్రైవేట్ హాస్పిటళ్లకు వెళ్లే అవసరం ఉండదు. దీంతో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది.

ప్రభుత్వం చర్యలు తీసుకుంది



జీజీహెచ్‌లో అన్ని రకాల సేవలను అందుబాటులోకి తెస్తున్నాం. పేదలకు నాణ్యమైన వైద్యాన్ని అందిస్తున్నాం. ఇప్పటికే గతంతో పోలిస్తే రోజుకు 1,500 మంది రోగులు వైద్యం చేయించుకుంటున్నారు. న్యూరాలజీ విభాగంలో స్పెషాలిటీ వైద్యులను నియమించారు. త్వరలో కార్డియాలస్ట్‌లను నియామకం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

– సిద్ధానాయక్, సూపరింటెండెంట్

ఓపీ ఇలా..

న్యూరాలజీ విభాగానికి ప్రత్యేకంగా 30 బెడ్స్‌ను అధికారులు కేటాయించారు. ప్రతి మంగళ, శుక్ర వారాల్లో ఈ వైద్యులను సంప్రదించవచ్చు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అందుబాటులో ఉంటారు. జీజీహెచ్‌లోని 12వ నంబర్ గదిలో ఓపీ సేవలు అందజేయనున్నారు. యూరాలజీ విభాగ వైద్యులు కూడా ఆ సమయంలోనే అందుబాటులో ఉండనున్నారు. ఈ క్రమంలో ఆయా విభాగాలకు వసతులు కల్పిస్తున్నారు. ఈ శుక్రవారం నుంచి డాక్టర్లు ఓపీ చూడస్తారని అధికారులు వెల్లడించారు.



న్యూరాలజీ విభాగం ఓపీ గది

టీడీపీ దిగజారుడు రాజకీయాలు

పొదలకూరు: సర్వేపల్లి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోంది. ఈనెల 5వ తేదీన పొదలకూరు మండలం యర్రబల్లి గ్రామానికి వెళ్లిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అక్కడ వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు, కార్యకర్తలకు బలవంతంగా టీడీపీ కండువాలు కప్పారు. గురువారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విరువూరు పర్యటనకు విచ్చేసిన సందర్భంగా వారు ఆయన వద్దకు వచ్చి తాము తొలి నుంచి సీఎం జగన్ అభిమానులమని, వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతామని వెల్లడించి పార్టీ కండువాలు వేసుకున్నారు. తమకు ఇల్లు కట్టుకునేందుకు రూ.లక్ష నగదు, జేసీబీ యంత్రం కొనిస్తామని మభ్యపెట్టి టీడీపీ కండువాలు కప్పినట్లు మీడియాకు వెల్లడించారు. రెండు రోజుల క్రితం వెంకటాచలం మండలం చెముడుగుంటకు చెందిన యువకులకు సోమిరెడ్డి టీడీపీ కండువాలు కప్పారు. వారు కూడా గురువారం పొదలకూరులో మంత్రి కాకాణిని కలిసి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పుకొన్నారు. తమను తెలుగుదేశం నేతలు మభ్యపెట్టినట్లు తెలిపారు.



విరువూరులో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో యర్రబల్లి కార్యకర్తలు

సోమిరెడ్డికి గుణపాఠం చెప్పండి

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సోమిరెడ్డి గెలిచే పరిస్థితి లేదని నిర్ధారణకు వచ్చి సిగ్గుమాలిన రాజకీయాలు చేస్తున్నట్లు తెలిపారు. సర్వేపల్లి టికెట్ కోసం పాకులాడుతూ నీచరాజకీయాలకు పాల్పడుతున్నాడని విమర్శించారు. ప్రజలు ఆయనకు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మంత్రి వెంట సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, యర్రబల్లి నాయకులు అంజయ్య, ప్రసాద్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఎం.వెంకటశేషయ్య, రమేష్, జెడ్పీటీసీ నిర్మలమ్మ ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యవర్గంలో జిల్లావాసులు

నెల్లూరు(లీగల్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యవర్గంలో జిల్లాకు చెందిన ఇద్దరు సీనియర్ న్యాయవాదులకు చోటు లభించింది. కావలి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కె.సురేంద్రరెడ్డి రాష్ట్ర కార్యదర్శిగా, నెల్లూరు బార్ అసోసియేషన్ ట్రెజరర్ ధన్పాల్ రమేష్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.



సురేంద్రరెడ్డి



రమేష్

ఏపీపీఎస్సీ పరీక్ష కేంద్రం పరిశీలన

ముత్తుకూరు: ఈనెల 25వ తేదీన జరిగే ఏపీపీఎస్సీ గ్రూప్–2 పరీక్షలకు సంబంధించి ముత్తుకూరు జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని గురువారం జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు పరిశీలించారు. గదులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఎంఈఓ హేమసుందర్రావు, హెచ్‌ఎం శ్రీనివాసులురెడ్డితో మాట్లాడారు. ఈ కేంద్రంలో మొత్తం 144 మంది పరీక్ష రాస్తారని ఎంఈఓ వెల్లడించారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సీఈఓ సూచించారు.



ఎంఈఓ, హెచ్‌ఎంలతో మాట్లాడుతున్న సీఈఓ

సూరాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

కోవూరు: నగదు విషయం అడిగినందుకు కులం పేరుతో దూషించిన వవ్వేరు కో–ఆపరేటివ్ బ్యాంకు మాజీ చైర్మన్ సూరా శ్రీనివాసులురెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు బుచ్చిరెడ్డిపాళెం సీఐ హైమారావు తెలిపారు. గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. శ్రీనివాసులురెడ్డి నెల్లూరు ఎన్టీఆర్ నగర్‌కు చెందిన దారా రమణయ్య వద్ద రూ.36 లక్షలు తీసుకున్నాడు. డబ్బు తిరిగివ్వాలని సూరా ఇంటికి పలుమార్లు రమణయ్య వెళ్లి అడిగాడు. అయితే సూరా తనను కులంపేరుతో దూషించి దౌర్జన్యం చేసి బయటకు తోసేశాడని రమణయ్య ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఆయనపై అట్రాసిటీ కేసు నమోదు చేశామన్నారు.



శ్రీనివాసులురెడ్డి

శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు

- పొరుగు మద్యం స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో బెంగళూరు నుంచి నెల్లూరుకు తరలిస్తున్న 43 బాటిళ్ల పొరుగు మద్యంను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేశారు. నెల్లూరు రైల్వే సీఐ కె.భుజంగరావు గురువారం నెల్లూరులోని తన కార్యాలయంలో తనిఖీల వివరాలను వెల్లడించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గుంతకల్ రైల్వే ఎస్పీ కె.చౌడేశ్వరి ఆదేశాల మేరకు నెల్లూరు రైల్వే డీఎస్పీ సి.విజయభాస్కర్ పర్యవేక్షణలో సీఐ తన సిబ్బందితో కలిసి రైళ్లలో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. బిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న బంగారు, వెండి ఆభరణాలు, నగదుతోపాటు పొరుగు మద్యం, గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులపై చర్యలు తీసుకుంటున్నారు. తాజాగా గూడూరు ఎస్సై కొండపనాయుడు తన సిబ్బందితో కలిసి గురువారం తెల్లవారుజామున గూడూరు ప్రాంతంలో శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు చేపట్టారు. నెల్లూరు నగరం చిల్డ్రన్స్ పార్క్ ప్రాంతానికి చెందిన పి.కృష్ణ అనుమానాస్పదంగా ఉండటంతో అతడిని అదుపులోకి తీసుకుని బ్యాగ్‌ను తనిఖీ చేయగా కర్ణాటక రాష్ట్రానికి చెందిన 39 లీటర్ల మద్యం, నాలుగు 750 ఎంఎల్ మద్యం బాటిళ్లను గుర్తించి సీజ్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. కృష్ణ కొంతకాలంగా బెంగళూరు నుంచి గుట్టుచప్పుడు కాకుండా మద్యం బాటిళ్లను తీసుకొచ్చి నెల్లూరు నగరంలో అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడని వెల్లడించారు. నిందితుడిని అరెస్ట్ చేసి పొరుగు మద్యంను సీజ్ చేసిన సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న రైల్వే పోలీసులు

పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

- నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి
- నెల్లూరు – మైపాడు రోడ్డు విస్తరణకు శంకుస్థాపన

ఇందుకూరుపేట: పేద ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సీఆర్ఐఎఫ్ నిధులు రూ.48 కోట్లతో నెల్లూరు – మైపాడు రోడ్డు విస్తరణకు ఎంపీ ఆదాల, కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డితో కలిసి గురువారం మండలంలోని ఆరో మైలులో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సుమారు 7.50 కిలోమీటర్ల మేర సిమెంట్ రోడ్డు, 11.75 కిలోమీటర్ల మేర తారురోడ్డు ఉంటుందన్నారు. ఇది పూర్తయితే మైపాడు పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ఆక్వా, అగ్రికల్చర్ ఉత్పత్తుల చేరవేత సులభతరం అవుతుందన్నారు. రోడ్డుకు అనుమతులు తీసుకొచ్చేందుకు దువ్వూరు కళ్యాణ్‌కుమార్‌రెడ్డి కృషి చేశారని అభినందించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా ఉందన్నారు. 15 ఏళ్లుగా ప్రయత్నిస్తున్న పెన్నాపై కాజ్‌వే పనులు నేటికి నెరవేరి శంకుస్థాపన చేసుకున్నామన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు అని ఎమ్మెల్యే ప్రసన్న అన్నారు. మైపాడు రోడ్డు అభివృద్ధికి శ్రమించిన కళ్యాణ్‌కుమార్‌రెడ్డిని అభినందించారు. ఎంపీ ఆదాల కేంద్ర మంత్రులతో చర్చించి కృషి చేశారన్నారు. ఇందులో డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి పాత్ర సైతం ఉందన్నారు. రోడ్డు పనులు పూర్తయితే మండల రూపురేఖలు మారిపోతాయన్నారు. నరుకూరు కూడలి నుంచి ఆరో మైలు కూడలి వరకు మోటార్‌బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నెల్లూరు మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పార్టీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, జొన్నవాడ ఆలయ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీ ఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, ఇందుకూరుపేట రూరల్ బ్యాంక్ చైర్మన్ గునుపాటి సురేష్ రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీ, ఎమ్మెల్యే

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం జగన్

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

చేజర్ల: 'ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. ఓ వైపు పథకాలు అందిస్తూనే మరో వైపు గ్రామాలను అభివృద్ధి చేస్తూ జనరంజక పాలన సాగిస్తున్నారు' అని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఆదూరుపల్లిలో గురువారం విజయీభవ యాత్ర జరిగింది. ఎమ్మెల్యే ప్రజలతో మాట్లాడుతూ పథకాలను వివరిస్తూ.. సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగారు. తొలుత జెడ్పీటీసీ సభ్యుడు పీర్ల పార్థసారథి తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గ్రామంలో నిర్మించిన పోలేరమ్మ తల్లి ఆలయ ప్రహరీని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.8 లక్షలతో నిర్మించిన సైడ్ కాలువను, ఇంకా రూ.43.6 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.17.67 లక్షలతో చేపట్టిన విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు ప్రారంభోత్సవం చేశారు. విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాట నిలబెట్టుకునే తమ ప్రభుత్వానికి, హామీలు అమలు చేయకుండా మోసం చేసిన గత టీడీపీ ప్రభుత్వానికి మధ్య తేడాను గమనించాలని ప్రజలను కోరారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పి.బాలగంగాధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అన్నలూరు శ్రీనివాసులునాయుడు, నాయకుడు పోలంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బి.వీరరాఘవరెడ్డి, సర్పంచ్ చేవూరి నారాయణమ్మ, చేజర్ల సర్పంచ్ ఆవుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




విజయీభవ యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

వ్యవసాయ యూనివర్సిటీగా అభివృద్ధి చేస్తాం

- మేకపాటి రాజమోహన్‌రెడ్డి

ఉదయగిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి పట్టణంలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలను వ్యవసాయ యూనివర్సిటీగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి తెలిపారు. ఈనెల 27వ తేదీన మేకపాటి గౌతమ్‌రెడ్డి రెండో వర్ధంతి. ఈ సందర్భంగా గురువారం ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డితో కలిసి కళాశాలలో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం రాజమోహన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ గౌతమ్‌రెడ్డి వర్ధంతి రోజున వ్యవసాయ కళాశాల ఆవరణలో సుమారు రూ.7 కోట్ల వ్యయంతో స్మృతివనం, కాంస్య విగ్రహం ఏర్పాటుకు పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రజలు తరలిరావాలని కోరారు. జగన్ 2024 ఎన్నికల్లో గెలిచి మరోసారి సీఎం కావడం ఖాయమన్నారు.



నాయకులతో చర్చిస్తున్న రాజమోహన్‌రెడ్డి

పౌల్ట్రీ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 114
లేయర్ (లైవ్)	: 80
బ్రాయిలర్ చికెన్	: 250
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 278
లేయర్ చికెన్	: 136

నెల్లూరు నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.80
సన్నవి : రూ.70
పండ్లు : రూ.34

